రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మంత్రి కోమటిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రజక సంఘం నేతలు

రామంతాపూర్,అక్టోబర్ 23: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ బుధవారం రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి జాతీయ ధోబీ రిజర్వేషన్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఉల్లెంగల యాదగిరి,రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక వినతి పత్రం సమర్పించారు. స్పందించిన మంత్రి ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పకడ్బందీగా గ్రూప్-1ను నిర్వహిస్తున్నాం

చీర్యాల్‌లోని గీతాంజలి కళాశాలలో గ్రూప్-1 పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్

కీసర, అక్టోబర్ 23: మండలంలోని చీర్యాల్ గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల పనితీరుపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష గదుల్లో తిరిగి కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలను గ్రూప్-1 పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, ఎగ్జామ్ కంట్రోలర్ దేవయ్య, తహసీల్దార్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



పారిశుధ్య నిబ్బందికి స్వచ్ఛఆటోలను అందిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్.

బోడుప్పల్, అక్టోబర్23: స్వచ్ఛ బోడుప్పల్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ కోరారు. బుధవారం మున్సిపల్ నిధులతో కొనుగోలు చేసిన 5 స్వచ్ఛవాహనాలను సిబ్బందికి అందజేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రతిరోజు ఇంటికి వచ్చే స్వచ్ఛ ఆటోలకు ఇచ్చి నగర పరిశుభ్రతకు తోడ్పాటు అందించాలని కోరారు.కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ ప్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



రథయాత్రలో కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్, అర్చకులు, కాలనీవాసులు

ఉప్పల్, అక్టోబర్ 23 : నాచారంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాచారంలో బుధవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథం ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ పాల్గొని, యాత్రలో కలిసి నడిచారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరాచార్యులు, అర్చక బృందం పర్యవేక్షణలో శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి డాక్టర్ తుమ్మల దుర్గాప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

త్వరలోనే ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయిస్తాం

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

ఉప్పల్, అక్టోబర్ 23 : నాచారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో త్వరలోనే ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేసేవిధంగా చూస్తామని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ అన్నారు. ఎల్బీనగర్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను బుధవారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ కలిశారు. ఈమేరకు పలు అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ ఉన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధిక టీకాలను ఇప్పించాలి

ఉప్పల్, అక్టోబర్ 23: డివిజన్ పరిధిలోని చిన్నారులకు తప్పనిసరిగ్గా వ్యాధి నిరోధిక టీకాలను తల్లిదండ్రులు ఇప్పించాలని డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేటర్ శ్రీదేవి బుధశారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని బస్తీ దవాఖాన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని, చిన్నారులకు విధిగా క్రమం తప్పకుండా వ్యాధి నిరోధిక టీకాలను వేయించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ పీహెచ్‌సీలో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

ప్రభుత్వ ఆస్తులకు రక్షణ ఏదీ?

19వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గతంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్

- ఇంటికి అడ్డుగా ఉందని పబ్లిక్ టాయిలెట్ తొలగింపు
- సమాచారం లేదన్న కమిషనర్
- ప్రజాధనం దుర్వినియోగం
- అయినా పట్టించుకోని అధికారులు

ఎన్టీఆర్ చౌరస్తాలో రాత్రికి రాత్రే పబ్లిక్ టాయిలెట్‌ను తొలగించిన దృశ్యం

బోడుప్పల్, అక్టోబర్ 23: ఓ వైపు ఆరోపణలు.. మరో వైపు విమర్శలు వస్తున్నా బోడుప్పల్ నగరపాలక సంస్థ అధికారుల తీరుమారడం లేదు. నగర పరిధి19 డివిజన్ ఎన్టీఆర్ చౌరస్తాలో ఓ బహుళ అతస్తు నిర్మాణానికి అడ్డుగా ఉందని ప్రభు త్వం ఏర్పాటు చేసిన టాయిలెట్‌ను రాత్రికిరాత్రే తొలగించారు. 2016లో మున్సిపల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రజల మౌలికవసతులు కల్పించడంలో భాగంగా నగరపరిధిలో దాదాపు రూ.64లక్షలతో 12 మూత్రశాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిలో భాగంగా బోడుప్పల్ ప్రధాన రోడ్డు ఎన్టీఆర్ ప్రధాన కూడలిలో ఒక పబ్లిక్ టాయిలెట్‌ను నిర్మించారు. అయితే ప్రైవేట్ వ్యక్తి ఇంటికి అడ్డుగా ఉందని రాత్రికి రాత్రే దాన్ని తొలగించారు. ఇదే విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకుపోగా విచారణ జరిపిస్తామని చెప్పాల్సింది పోయి మాకు ఎలాంటి సమాచారం లేదు..అంటూ విషయాన్ని దాటవేశారు. ప్రజలకు మౌలిక వసతులను మెరుగుపరుచాల్సిన అధికారులు ప్రైవేట్ ఆస్తులకు అడ్డుగా ఉందని రోడ్డు పక్కన నిర్మించిన పబ్లిక్ టాయిలెట్‌ను తొలంగిచిన వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

వారం క్రితమే జలమండలి ప్రహరీ కూల్చిన వైనం

ప్రభుత్వ ఆస్తులను రక్షించడంలో అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితమే ఓ కాంగ్రెస్ నాయకుడు చెంగిచర్ల జల మండలి ప్రహరీని జేసీబీతో కూల్చివేశారు. ఈ విషయం సోషల్‌మీడి యా, 'నమస్తే తెలంగాణ' తదితర దినప్రతికల్లో పబ్లిష్ కావడంతో కమిషనర్ రామలింగం దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్రహరీని కూల్చిన వ్యక్తితోనే తిగిరి నిర్మింపచేశారు. మరి లక్షల నిధులు వెచ్చించి నిర్మించిన పబ్లిక్ టాయిలెట్‌ను తొలగించిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

పేద విద్యార్థులకు బీఎల్ఆర్ ట్రస్ట్ చేయూత

విద్యార్థి నిఖిల్‌చారికి కాలేజీ ఫీజు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, అక్టోబర్ 23: పేద విద్యార్థులను ఆదుకునేందుకు బీఎల్ఆర్ ట్రస్ట్ కృషి చేస్తుందని బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని వెంకటేసాయి ఎన్‌క్లేవ్‌కు చెందిన విద్యార్థి నిఖిల్ చారికి ఎంబీబీఎస్ సీట్ లభించడంతో విద్యార్థి కాలేజీ ఫీజు రూ.29వేల చెక్కును బుధవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఎంబీబీఎస్ సీటు పొందిన విద్యార్థులకు కాలేజీ ఫీజు మొత్తం బీఎల్ఆర్ ట్రస్ట్ చెల్లిస్తుందన్నారు. గతంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆయా రంగాల్లో బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ తరగతులను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించామని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కనకరాజుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అనిల్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో వ్యక్తి ఆత్మహత్య

మల్కాజిగిరి, అక్టోబర్ 23: మానసిక ఒత్తిడితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మల్కాజిగిరి ఎస్సై గణేష్ కథనం ప్రకారం.. మౌలాలికి చెందిన వేణుగోపాల్ రెడ్డి(52) ప్రైవేట్ ఉద్యోగి. గతంలో అమెరికాకు వెళ్లి 2021లో తిరిగి వచ్చాడు. కొన్ని రోజుల తర్వాత తండ్రి హన్మంతరెడ్డి, తల్లి శారదను సొంత ఊరైన వనపర్తి జిల్లాలోని యేనిగండ్లకు పంపించాడు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వేణుగోపాల్‌రెడ్డి ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో పక్కింటి వారు ఆయన బంధువులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి తలుపులు తెరచి చూడగా.. వేణుగోపాల్ రెడ్డి ఫ్యాన్‌కు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన సోదరి అరుణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు.

బొడ్రాయికి ప్రత్యేక అభిషేకం

కీసర,అక్టోబర్23: మండల కేంద్రంలోని బొడ్రాయికి వేద పండితులు బుధవారం ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. ఈనె ల 27 ఆదివారం బోనాల పండుగను నిర్వహిస్తుండడంతో బొడ్రాయికి వేద పండితులు వెంపటి ప్రభాకర్ శర్మ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు.

జవహర్‌నగర్‌కు అత్యధికంగా

ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తాం



దేవేందర్‌నగర్‌కాలనీలో నీసీ రోడ్డు పనులను ప్రారంభించిన వజ్రేష్‌యాదవ్, మేయర్ శాంతి

జవహర్‌నగర్, అక్టోబర్ 23: పేదలు నివసించే జవహర్‌నగర్‌కు అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి తోట కూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ కార్పొరేటర్ కుతాడి సాయికుమార్ ఆధ్వర్యంలో భాగ్యనగర్, దేవేందర్‌నగర్‌కాలనీలలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 15లక్షలతో నీసీ రోడ్డు పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వజ్రేష్‌యాదవ్, మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ నగేశ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, నాయకులు సతీష్‌గౌడ్, భాస్కర్, యాదగిరియాదవ్, శ్రీనివాస్, నర్సింహ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కంటిపై కునుక లేకుండా చేస్తున్న కాంగ్రెస్



రామంతాపూర్ బాలకృష్ణానగర్‌లో మూసీ నదిని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తదితరులు.

- మూసీ బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది
- మూసీ పరివాహక ప్రాంతాల్లో ఎంపీ ఈటల పర్యటన

రామంతాపూర్,అక్టోబర్ 23: కాంగ్రెస్‌ను గెలిపించిన కర్మానికి పేద ప్రజల కంటికి కునుకు లేకుండా చేస్తుందని స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ , పలువురు సీనియర్ నాయకులతో కలిసి రామంతాపూర్ బాలకృష్ణానగర్ మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. మూసీ నది పక్కన 30ఏండ్లుగా నివాసముంటున్న పేదల ఇండ్లు కూలగొడుతున్నారని వారి బీజేపీ అండగా ఉంటుందన్నారు.ఆదివారం వస్తే పేద ప్రజలు భయ భ్రాంతులవుతున్నారన్నారు. నోరు విప్పితే చాలు సీఎం రేవంత్‌రెడ్డి అబద్దాలే మాట్లాడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పరిపాలనపై దృష్టి సారించాలన్నారు.కూలగొట్టుడు, డబ్బులు వసూలు చేసుడు బంద్ చేయాలన్నారు. పేద ప్రజలు ఉసురు మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీవాణి వెంకట్‌రావు, చేతన హరీశ్, నాయకులు జిల్లా మహిళా అధ్యక్షులురాలు శిల్పారెడ్డి, నాయకులు శాగరవీందర్, బాలకృష్ణగౌడ్, సాయికిరణ్,జగదీశ్,నర్సింహారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేస్తాం

రామంతాపూర్ డివిజన్‌లోని ప్రగతినగర్,గోఖలేనగర్,బృందావన్‌గార్డెన్ ప్రాంతాల్లోబుధవారం రూ.92లక్షలతో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్, సీవరేజ్‌లైన్‌ను ఎంపీ ఈటల రాజేందర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

ఎంపీకి ఈటలకు ఆహ్వానం

కీసర:చీర్యాల్ గ్రామంలో శ్రీ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి రావాల్సిందిగా ఎంపీ ఈటల రాజేందర్‌కు బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ కోల అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో చీర్యాల్ గ్రామ నేతలు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

తొలగించిన ఏఈవోలను విధుల్లోకి తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ విస్తరణ అధికారులు సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్ ,హాజరైన ఏఈవోలు

శామీర్‌పేట, అక్టోబరు 23 : తొలగించిన వ్యవసాయ విస్తరణ అధికారులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఈవోల రాష్ట్ర అడ్‌హక్ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూంకుంట మున్సిపాలిటీలోని వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏఈవోలు సమావేశమైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధికి శ్రమిస్తున్న 167 మంది ఏఈవోలను ప్రభుత్వం సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు.

వెంటనే వారి సస్పెన్షన్ ఎత్తివేసి, విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ సర్వేలో ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఇతర రాష్ట్రాల్లో సర్వే నిర్వహిస్తుంటే తెలంగాణ ప్రభుత్వ వైఖరి భిన్నంగా ఉందన్నారు. ఈ సమావేశంలో అడ్‌హక్ కమిటీ కన్వీనర్లు పంజాల రాజు, కల్లేపల్లి పరశురాం, బండెల సుమన్, కల్యాణి, 32 జిల్లాల కో కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

పుట్‌పాత్‌లపై వ్యాపారం..ట్రాఫిక్‌కు అంతరాయం

దమ్మాయిగూడలోని బండ్లగూడలో జరుగుతున్న పుట్‌పాత్ వ్యాపారాలు

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబరు 23: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిల్లో పుట్‌పాత్‌లపై వ్యాపారులతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నాగారం, రాంపల్లి, దమ్మాయిగూడ పరిధిలోని దమ్మాయిగూడ, బండ్ల బండ్లగూడలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా పుట్‌పాత్‌లను ఆక్రమించుకొని, వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.హోటళ్లు, టీ స్టాళ్లు, పండ్ల దుకాణాలు, బట్టల దుకాణాలు తదితర వ్యాపారాలు జరుగుతున్నాయి. పుట్‌పాత్‌ల వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వినియోగదారులు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఇది రాకపోకలు తీవ్ర ఇబ్బందిగా మారింది. బస్సులు, లారీలు తదితర పెద్ద వాహనాలు రోడ్డులో వస్తే ట్రాఫిక్ స్తం భించి ముందుకెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది.బండ్లగూడలో బస్‌షెల్టర్‌లను సైతం వదలలేదు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి పుట్‌పాత్ వ్యాపారాలను తొలగించి, ప్రజలు ఇబ్బందులు తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పుట్‌పాత్ వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం..

పుట్‌పాత్ వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలో పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారులు చేస్తే చర్యలు తీసుకుంటాం.ఈ విషయంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, పుట్ వ్యాపారాలను తొలగిస్తాం.

-నాగమణి, కమిషనర్,
దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీ

యువతి అదృశ్యం

నాగలక్ష్మి (ఫైల్)

నేరేడ్‌మెట్, అక్టోబర్ 23: యువతి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సైదులు కథనం ప్రకారం.. వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న పేరూరు నాగలక్ష్మి (24) విశాల్‌మార్ట్‌లో ఉద్యోగం చేస్తుంది. రోజులాగానే బుధవారం ఉదయం తన సోదరుడు నాగలక్ష్మిని సైనిక్‌పురిలోని విశాల్‌మార్ట్‌లో వదిలి వెళ్లాడు. రాత్రివరకు ఇంటికి చేరుకోలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. సాయంత్రం కుటుంబ సభ్యులు నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరిస్తా

దుండిగల్,అక్టోబర్23: ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు,బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,కాలనీ/బస్తీ సంఘాల సభ్యులు బుధవారం ఆయనను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మేడ్చల్, అక్టోబరు 23: విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా 11కేవీ చెరువుకుంట, 11కేవీ ఐడీఏ గణపతి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్టు రూరల్ ఏఈ పవన్‌చందు ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ చెరువు కుంట పరిధిలోని చెరువుకట్ట రోడ్డు, అత్వెల్లి ఎస్ఎస్ కుడి వైపున ప్రాంతానికి ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, ఐడీఏ గణపతి ఫీడర్ పరిధిలోని మాధవ రెడ్డి, అత్వెల్లి ఎస్ఎస్ ఎడమవైపు ప్రాంతానికి ఉదయం 1.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం విధిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే మండల పరిధిలోని పూడూరు గ్రామానికి ఉదయం 10నుంచి 11.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం విధిస్తున్నామని పట్టణ ఏఈ తెలిపారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం

నేరేడ్‌మెట్, అక్టోబర్ 23: ప్రాథమిక హక్కులపై అవగాహన ఎంతో అవసరమని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మొమిన్‌బాష అన్నారు. బుధవారం వినాయకనగర్‌లోని తన కార్యాలయంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా సభ్యులు మొమిన్‌బాషను సభ్యులతో కలిసి రాష్ట్ర జనరల్ సెక్రటరి నారాయణ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, ఆశ, జాహ్నవి, భాగరాణి, దుర్గ, కేటేశ్వరి, బెత్తిన , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణస్వీకారం

భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేసిన కార్యవర్గం

రామంతాపూర్, అక్టోబర్ 23: పాతరామంతాపూర్‌లోని దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం బుధవారం జరిగింది. ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా నామ్ రాజిరెడ్డి,సభ్యులుగా మేడిపల్లి విశాల్‌రెడ్డి, మోగిలి లింగం,ఎరుకుల సతీశ్,మెంగాశోభ,బొడ్డు బాలయ్య,ముత్యాల జంగయ్య,ఎక్స్‌అఫిషియో సభ్యుని గా మోత్కూరి శేఖర్‌బాబు శర్మ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆగిరెడ్డి, మురళీగౌడ్, శ్రీకాంత్‌యాదవ్,శ్రీనివాస్‌యాదవ్, శ్రీధర్,సందీప్, భాస్కర్,ముత్యాలబాబు,జంగయ్య, అరుణ్,సాయిశంకర్, విజయ్ ,తోఫిక్,తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

మేడ్చల్, అక్టోబరు 23 : నీటి గుంతలో పడిన యువకుడి మృతదేహం లభ్యమైంది. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్న యువకుడు మహేశ్ (21) మద్యం తాగి మంగళవారం నీటి గుంతలో పడిన విషయం విదితమే. సమాచారం అందుకున్న పోలీసులు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో గాలించిన ఫలితం లేకుండా పోయింది. కాగా బుధవారం యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఐఎన్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

బోడుప్పల్, అక్టోబర్23: బోడుప్పల్ కార్పొరేషన్ 5వ డివిజన్ పరిధిలోని ఎన్ఐఎన్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా దీటి గణేష్, ప్రధాన కార్యదర్శిగా ఉమేశ్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా ఐలయ్య, ఉపాధ్యక్షులుగా సురేష్‌యాదవ్, కోశాధికారిగా రవీందర్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్‌గౌడ్‌లను కాలనీ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

కాలనీ నూతన కార్యవర్గం సభ్యులు

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ మండలపు విశ్వ మోహన్, PSR కన్‌స్ట్రక్షన్స్ LLP యొక్క మేనేజింగ్ డైరెక్టర్, కార్యాలయం: PSR టవర్-304, 126 (P, ప్రక్కన, PSR ప్రైమ్ టవర్స్ రోడ్, DLF సైబర్ సిటి ప్రక్కన, గన్‌పౌలి, హైదరాబాద్-32 వారు ఘట్కేసర్ (P) గ్రామం, ఘట్కేసర్ మండలం, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వద్ద గల, 1) సర్వే నెం.244/ఇలో ఎక.0.03 గుంటలు విస్తీర్ణం, 2) సర్వే నెం.244/ఇలో ఎక.0.01 గుంటలు విస్తీర్ణం మరియు సర్వే నెం.244/ఆలో ఎక.0.02 గుంటలు విస్తీర్ణం, 3) సర్వే నెం.244/ఇలో ఎక.0.03 గుంటలు విస్తీర్ణం, 4) సర్వే నెం.244/ఆలో ఎక.0.02 గుంటలు విస్తీర్ణం మరియు సర్వే నెం.244/ఆలో ఎక.0.01 గుంటలు విస్తీర్ణం, 5) సర్వే నెం.244/ఇలో ఎక.0.03 గుంటలు విస్తీర్ణం, 6) సర్వే నెం.244/ఆలో ఎక.0.03 గుంటలు విస్తీర్ణం, 7) సర్వే నెం.244/ఆలో ఎక.0.03 గుంటలు విస్తీర్ణం, 8) సర్వే నెం.244/ఆలో ఎక.0.03 గుంటలు విస్తీర్ణం మరియు 9) సర్వే నెం.244/ఆలో ఎక.0.06 గుంటలు విస్తీర్ణం, మొత్తం ఎక.0-30 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూమి యావత్తుకు సంబంధించి యజమానులు అనగా 1) శ్రీమతి నమని విజయ, 2) శ్రీమతి ఎల్లెతి శ్రీలత, 3) శ